క్లుప్తంగా

ఉపాధి శ్రామికులకు మజ్జిగ పంపిణీ



ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న హెచ్ఎం మల్లికార్జునరావు

దెందులూరు: మండలంలోని ఉపాధి కార్మికులకు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లికార్జున రావు, గ్రంథాలయాధికారి గొల్లపూడి వెంకటేశ్వరరావు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా శ్రామికులకు మజ్జిగ ప్యాకెట్లు తమ వంతు వితరణగా అందజేస్తున్నామన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం మండల ఏపీఓ ఫాతిమా, ఫీల్డ్ అసిస్టెంట్ జహీర్ తదితరులు ఉన్నారు.

వృద్ధులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

దెందులూరు: వేసవి తీవ్రత దృష్ట్యా వృద్ధులు, చిన్నారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం ఎస్సీ పరిధిలో దోసపాడులో వైద్య సిబ్బంది వృద్ధులకు, చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి వైద్య పరీక్షలు చేశారు. వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఆహారపు నియమాలు పై సుదీర్ఘంగా అవగాహన కల్పించారు.

నేడు తిరంగా యాత్ర

దెందులూరు: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాల్లో భాగంగా దెందులూరులో సాయంత్రం తిరంగా యాత్రను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో కె.శ్రీదేవిలు తెలిపారు. తిరంగా యాత్రకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాలుగు మండలాల అధికారులు, మాజీ సైనికులు హాజరు కావాలని కోరారు.

గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలి



గుణ్ణంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో కలెక్టర్ వెట్రిసెల్వి

ద్వారకాతిరుమల: వేసవి దృష్ట్యా గర్భిణులు, పిల్లలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని గుణ్ణంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించి, అక్కడ మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వేసవిలో తీసుకోవాల్సిన చర్యలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు వారికి వైద్య సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భిణులు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న వాననీటి సంరక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎంవీ రమణ, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఐసీడీఎస్ సీడీపీఓ బ్యూలా, ఎంపీడీఓ పీవీవీ ప్రకాష్, తహసీల్దార్ జేవీ సుబ్బారావు, అంగన్‌వాడీ సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇకపై ప్రతి నెలా మూడో శనివారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఉన్న మౌలిక వసతులు, ఇతర సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయాలని కోరారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అమృతరామయ్య, కౌన్సిలర్లు ఉగ్గం దుర్గాప్రసాద్, పీపీఎన్ చంద్రరావు, మానవతా మూర్తి, సంకు సురేష్, కనుమూరి లావణ్య, ముప్పని రమణ, లోకవరపు వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, పెసరగంటి త్రిమూర్తులు, దిర్సిపోము రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రజారోగ్యం

- రోడ్డు పైనే మురుగునీరు, చెత్త చెదారం
- గ్రామాల్లో సమస్యలు ఇలా– స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ఎలా



గాలాయగూడెం రోడ్డు మీద మురుగు నీరు



దెందులూరు ఉన్నత పాఠశాల గోడవద్ద వ్యర్థ పదార్థాలు

దెందులూరు: పట్టణం..పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగత పలుకుతుంది. పట్టణం..పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితి నెలకొంది. ప్రధాన రహదారులు అంచులనే మున్సిపల్, గ్రామ పంచాయతీలు డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నాయి.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య, కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణం, గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగు నీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో పట్టణంలోని, మండలాల్లోని గ్రామాల్లో వీధులు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారింది. దీంతో స్థానికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

వ్యర్థాలన్నీ రోడ్ల పక్కనే..

మండలంలోని జాతీయ రహదారి ఇరువైపులా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తకుప్పల వలన అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాలి వీచినప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, పాలిథీన్ కవర్లు ఎగురొచ్చి వాహనాలపై పడుతుండడంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా నిల్వ పదార్థాలను రోడ్డుపై వేయడంతో ప్రజలు, వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేకాకుండా ఖాళీ కొబ్బరి బొండాలు, కోళ్లు, చేపల వ్యర్థాలు కూడా ఇక్కడే పడేస్తున్నారు. ఈ రహదారి ఇరువైపులా రాకపోకలు సాగించే వారికి నిత్యం ఆగచాట్లు తప్పడం లేదు. రాత్రిళ్లు వాహనాల వేగంతో పాటు ఈచెత్తనుంచి వచ్చే చెడు వాసనలు భరించలేకపోతున్నామని వాపోతున్నారు.



దెందులూరు నియోజకవర్గ వైద్యశాల వద్ద చెత్తాచెదారం, కొబ్బరి బొండాలు

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాన్ని పరిశీలించిన ఎంఈఓ అన్నమ్మ

దెందులూరు: దెందులూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని దెందులూరు మండల విద్యాశాఖ అధికారిని శనివారం కె.అన్నమ్మ తనిఖీ చేశారు. నాణ్యమైన భోజనం చిన్నారులకు, గర్భిణులకు అందజేయాలని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ, అంగన్‌వాడీ టీచర్ సేనాపతి హైమ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

దెందులూరు: విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రైవేట్ ఫ్యాక్టరీలు సముదాయం చలివేంద్రాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త కలపాల చంద్రశేఖర్ బుజ్జి ప్రారంభించారు. శనివారం ఉదయం మలుపు వద్ద ఆయన సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్, ఫ్యాక్టరీ కార్మికులు, పాదచారులు, రైతులు, ప్రయాణికులు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుజ్జి కోరారు.

ప్రజాప్రతినిధుల సహకారం అభినందనీయం



భీమడోలు: కోడూరుపాడులో ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న అధికారులు



ఉంగుటూరు: బాదంపూడిలో పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు: ప్రభుత్వ పథకాల అమలులో ప్రజాప్రతినిధులు సహకారం ఎనలేనిదని భీమడోలు ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, స్వచ్ఛమైన తాగునీటిని అందించడం, బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా ఎంపికైన కోడూరుపాడు గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.డిప్యూటీ ఎంపీడీఓ ఏ.సుందరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతామన్నారు. అనంతరం ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక అయ్యేందుకు కృషి చేసిన సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పాల్నాటి శ్రీనివాస్, కార్యదర్శి వెంకట్రావు, శానిటరీ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పోలసానిపల్లి గ్రామంలో మూడో శనివారం పురస్కరించుకుని సర్పంచ్ షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పొడి, తడి చెత్త సేకరణ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శులు తనూజ, యు.జయరామకృష్ణ, మద్దు శ్రీను పాల్గొన్నారు. అలాగే భీమడోలు మండల విద్యావనరుల కేంద్రంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంఈఓల పర్యవేక్షణలో కార్యాలయ పరిసరాలను ఉపాధ్యాయులు, ఆసుపత్రి కార్యాలయ సిబ్బంది పరిశుభ్రం చేసారు. కార్యాలయం వద్ద ఇంకుడుగుంతలు తవ్వారు. కార్యక్రమంలో టీచర్లు మండే సుధాకర్, సుబ్రహ్మణ్యం, శర్మ, సీఆర్‌పీలు ఎస్వీ సత్యప్రసాద్, సీహెచ్ రమణ పాల్గొన్నారు.



గణపవరం: పంచాయతీ వద్ద స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

స్వచ్ఛ ఆంధ్రతోనే ఆరోగ్యకరమైన సమాజం

గణపవరం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని, తద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చునని డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ ఎడ్వర్డ్ అన్నారు. శనివారం గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం సర్పంచ్ మూర అలంకారం అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వచ్ఛ గణపవరం నిర్మాణానికి గ్రామ ప్రజలంతా సహకరించాలని, తడి, పొడి చెత్తలను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్‌లకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి డి.శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

బాదంపూడిలో..

ఉంగుటూరు: బాదంపూడి గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర బీట్ ది హీట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య సేవలు గురించి తెలియచేశారు. మండలంలో శానిటేషన్ విభాగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని ధర్మరాజు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజీమనోజు, సర్పంచి కంకటాల పద్మలీల, కూటమి నాయకుడు అయ్యప్ప, ఎంపీటీసీ సభ్యురాలు తప్పిట్ల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణను పాటించాలి

భీమడోలు: విద్యార్థి దశ నుంచి ఆర్థిక క్రమశిక్షణను పాటించాలని భీమడోలు పోస్ట్ మాస్టర్ కొల్లి ప్రసాద్ అన్నారు. భీమడోలు పూళ్ల, గుండుగొలను శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులను శనివరం ఉత్సాహంగా నిర్వహించారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు పాల్గొని చిన్నారులకు నీతి కథలను వినిపించారు. చిన్నారులు నీతి కథలు చెప్పి అలరించారు. అనంతరం భీమడోలు పోస్టుమాస్టర్ కొల్లి ప్రసాద్ శిక్షణ తరగతులను సందర్శించి ఆర్థిక అక్షరాస్యతపై పలు విషయాలు వివరించారు. తొలుత స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నీరు–మీరు నినాదంతో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో, గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు.



తపాలా పథకాలపై అవగాహన కల్పిస్తున్న పోస్టుమాస్టర్ కొల్లి ప్రసాద్

పుస్తక పఠనం విజయానికి నాంది

దెందులూరు: పుస్తక పఠనం విజయానికి నాంది అని పోతునూరు గ్రంథాలయాధికారి రాంబాబు అన్నారు. శనివారం పోతునూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి పత్రికలు, పుస్తకాలు చదవడంపై అత్యధిక ఆసక్తి ఉండాలన్నారు. ప్రపంచ జ్ఞానం రావాలంటే పత్రికలు పుస్తకాలు చదవాలన్నారు. విద్యతోనే అభివృద్ధి అవగాహన ముడిపడి ఉందని తల్లిదండ్రులు విద్యార్థుల విద్యాభ్యాసంలో నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు.



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

వడదెబ్బ నివారణపై అవగాహన

భీమడోలు: ఎండల్లో బయట తిరగవద్దని, దీని వల్ల వడదెబ్బకు గురై ప్రమాదం ఉందని భీమడోలు సామాజిక ఆరోగ్యం కేంద్రం సూపరిండెంటెంట్ సునీత అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వడదెబ్బ నివారణపై రోగులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరిండెంటెంట్ సునీత మాట్లాడుతూ గతమెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో వడదెబ్బకు గురయ్యే అవకాశాలున్నందున ఎండల్లో బయటకు రావద్దని, తప్పనిసరైతే విధిగా గొడుగులు, టోపీలు పెట్టుకుని తిరగాలన్నారు. ప్రతి రోజూ 15 గ్లాసుల నీరు తాగాలని, కొబ్బరి బొండాలు, సబ్జా నీళ్లు తాగితే దప్పిక తీరుతుందన్నారు. దీని వల్ల వడదెబ్బ బారిన పడకుండా ఉంటారని, ఇంట్లోని పిల్లలు, రోగులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిని పెట్టాలని కోరారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమడోలు సీహెచ్‌సీలో రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న సూపరిండెంటెంట్ సునీత

వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి

చింతలపూడి: ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా ఆదేశించారు. చింతలపూడి మండలంలోని రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలతో ఏడీ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌలు రైతులకు క్రాఫ్ కల్టివేషన్ రైట్ కార్డ్స్ జారీ, అన్నదాత సుఖీభవ రైతుల ధ్రువీకరణ, పురోగతిపై, మట్టి నమూనాల సేకరణపై సమీక్ష చేశారు. అనంతరం రైతు సేవా కేంద్రాలకు అవసరమైన స్టేషనరీ సామాగ్రిని రైతు సేవ కేంద్రం ఇన్‌చార్జిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ సాగు పట్ల శ్రద్ధ చూపాలని రైతులకు సూచించారు. భూసార పరీక్షలతో నేలలో లభ్యమయ్యే పోషకాలతో పాటు చౌడు గుణాలు, ఎక్కువ సున్నం కలిగిన గుణాలను కూడా తెలుసుకుని తద్వారా ఎరువుల యాజమాన్య పద్ధతులు చేపట్టడం వల్ల పంటలపై పెట్టే పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో భూసార పరీక్షలు కోసం మట్టి నమూనా సేకరణ విధానాన్ని పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం ఆవరణలో పక్షుల దాహార్తిని తీర్చడానికి నీటి పళ్లేలను ఏర్పాటు చేశారు. అంతకుముందు చింతలపూడి పట్టణంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంచినీటి సమస్య లేకుండా చూడాలి

గణపవరం: వేసవి దృష్ట్యా మండలంలో ఏ గ్రామంలోనూ మంచినీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా శివారు ప్రాంతాలపై దృష్టి సారించాలని గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము సూచించారు. శనివారం గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాము అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ కాల్వలు వదిలి, నీరు గ్రామాలకు చేరే వరకూ నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. అలాగే ఆక్వా చెర్వుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసుకున్న రైతులకు ఇంత వరకూ సబ్సిడీ అందలేదని దీనిని త్వరగా చెల్లించాలని కోరారు. ఆర్అండ్‌బీ అధికారి మాట్లాడుతూ మండలంలో గతంలో నిధులు మంజూరైన అర్ధవరం, వల్లూరు గ్రామాల ఆర్అండ్‌బి రోడ్ల నిర్మాణం ఇటీవలె పూర్తయిందని, అలాగే నాలుగు రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేయగా మరమ్మతులు పూర్తి చేశామన్నారు. మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ మాట్లాడతూ ఆధార్ లింక్ లేని రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించదని, ఆధార్ లింక్ చేసుకోని రైతులు మండలంలో 1500 మంది ఉన్నారన్నారు. మండలంలో 2090 మట్టి నమూనాలు పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపామన్నారు. వెటర్నరీ డాక్టర్ నాగజ్యోతి మాట్లాడుతూ దొమ్మవ్యాధి నివారణకు మండలానికి 1700 వ్యాక్సిన్‌లు రాగా 690 వ్యాక్సిన్‌లు ఇప్పటివరకూ వేశామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి మాట్లాడుతూ 17 అంగన్‌వాడీ కేంద్రాలకు టాయిలెట్స్ మంజూరైనట్లు తెలిపారు. నాడు–నేడు పథకంలో నాలుగు కేంద్రాల నిర్మాణం జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్ మట్లాడుతూ మండలంలో ఫిల్టర్‌బెడ్స్ మరమ్మతులకు ఒక్కోదానికి రూ.1.75 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ప్రతి పంచాయతికీ రెండు టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు మంజూరైనట్లుచెప్పారు. ఐకేపీ ఏపీఎం హన్సారి మాట్లాడుతూ మండలంలోని ముగ్గుళ్ల, వెలగపల్లి గ్రామాలలో సుమారు 40లక్షల రూపాయలు వీఓఏలు దుర్వినియోగం చేసినట్లు తేలిందని, ముగ్గుళ్ల వీఓఏపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసునమోదైనట్లు తెలిపారు. వారినుంచి ఆర్ఆర్ చట్టం ప్రకారం సొమ్మును రికవరీ చేస్తామన్నారు. డ్వాక్రా సభ్యులెవరూ నగదు చెల్లింపులు చేయవద్దని సూచించారు. ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్షయోజన పథకం ద్వారా రూ.20 ప్రిమియం చెల్లిస్తే రూ.2లక్షల భీమా సహాయం వస్తుందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారి సుమలత మాట్లాడుతూ మండలంలో 17 వేల మంది ఉపాధి కార్మికులు ఉండగా 10,500 మందిని పీఎం సురక్ష యోజన పథకంలో చేర్పించినట్లు తెలిపారు. సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామ సమస్యలు వివరించారు.



గణపవరం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలక్ష్మి

అలరించిన నాటికలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజ పోకడలనే కథాంశాలుగా చేసుకుని ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. విజయవాడ శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సైకో థెరపీ ద్వారా మానసిక బలహీనులను మార్చే ఒక సైకాలజిస్ట్ పిచ్చివాడుగా మారే పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చూపిన అనస్వరం నాటిక ఆలోచనాత్మకంగా ఆకట్టుకుంది. తాడేపల్లి, కుంచనపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ సంస్థ కళాకారులు ప్రదర్శించిన విడాకులు కావాలి నాటిక భారతీయ వివాహ బంధం ఔన్నత్యాన్ని చాటుతూ కొనసాగింది. తొలుత అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం హేలాపురి కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17, 18, 19, 20 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి నాటిక పోటీలు శనివారం సాయంత్రం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, తదితరులు పాల్గొని కళా సాంస్కృతిక రంగాల్లో నగరానికి ఉన్న కీర్తి ప్రతిష్టలను కొనసాగిస్తూ జాతీయ స్థాయిలో నాటిక పోటీలు నిర్వహించడం అబినందనీయమన్నారు. ఏలూరు నగర కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేసిన ఆలపాటి రామచంద్రరావు కుమారులు అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజా వివిధ రంగాలలో చేసిన, చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో హిందూ యువజన సంఘం మనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, సెక్రటరీ కళారత్న కేవీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షులు ఇరదల ముద్దుకృష్ణ,సెక్రటరీ మజ్జి కాంతారావు, వేణు గోపాల్ లునాని, వేమా కోటేశ్వరరావు, ఆర్ఎస్ఆర్ నాగేశ్వర రావు, ఎల్. వెంకటేశ్వరరావు, కేబీ రావు, కానాల రమేష్, జీ. శ్రీనివాసరావు, జీ. లలితాశర్మ, లంకా వెంకటేశ్వర్లు, మారం హనుమంతరావు, కానాల మురళీకృష్ణ, అంబికా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. హేలాపురి కళాపరిషత్ నిర్వాహకులు సంకు సురేష్, పెదపాటి రామకృష్ణ, మహమ్మద్ ఖాజా వలి నాటిక ప్రదర్శనలు పర్యవేక్షించారు.



విడాకులు కవాలి నాటికలోని కీలక సన్నివేశం



అనస్వరం నాటికలో ఆకట్టుకున్న సన్నివేశం